మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## ఇంటింటికి అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

**జగదేవ్‌పూర్, జనవరి 4 (ప్రభాతవార్త):**
మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో గురువారం శ్రీరామ కోటేశ్వరాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయోధ్య రాముని అక్షింతలను రామ భక్తులు భజన చేస్తూ ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాచర్ల నరేష్ మాట్లాడుతూ అయోధ్య రాముని అక్షింతలను ప్రతి ఒక్కరూ ఇంట్లో భద్రపర్చుకొని 22వ తేదీన అయోధ్య రాముని మందిరం ప్రారంభం ఉన్నందున పూజిత అక్షింతలను ఎవరి ఇంటి వద్ద వారు పూజలు నిర్వహించి వేడుకలకు ఆ అక్షింతలను వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ కోటేశ్వరాలయ కమిటీ అధ్యక్షుడు న్యాలమడుగు బాలకృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు న్యాలమడుగు హనుమంతరెడ్డి, సభ్యులు దేశాయ్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి బరిగె సావిత్రి నర్సింలు, బిక్షపతి, ఐలయ్య, కదుర్ల ఆంజనేయులు, అనిల్, శ్రీను, చిలుముల కృష్ణ, భూమల్ల రాజు, ఎల్లం, కొండయ్య, బండారు నర్సింలు, మల్లేశం, చంద్రమౌళి, తీగుళ్ళ యాదయ్య, కె.శ్రీనుగౌడ్, బరిగె సాయికుమార్, జనార్ధన్‌రెడ్డి, కూతురు సంతోష్‌రెడ్డి, మహిపాల్, పర్శరాములు, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**కొమురవెల్లి, జనవరి 4, ప్రభాతవార్త:**
సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గురువారం హైదారాబాద్‌లోని సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపడంతో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా జనగామ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అనంతరం డిప్యూటీ సిఎం, రాష్ట్ర అర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి అభినందనలు తెలిపారు.



సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి 4 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐటీ శాఖ మంత్రి, కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేష్‌లను కలిసి కేంద్రప్రభుత్వ మెమో 57 ఆధారంగా డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింజేయాలని వినతిపత్రం అందజేశారు. దీనికి వారు సానుకూలంగా స్పందిస్తూ త్వరలో సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల్లో అమలవుతున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని, జీవో 317 ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, బదలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలని, పదోన్నతుల్లో టెట్ మినహాయింపు ఇవ్వాలని లేదా ఆరు సంవత్సరాల్లో పాస్ అయ్యేవిధంగా అవకాశం ఇవ్వాలని, ఎస్ఈఆర్‌టీని ప్రక్షాళన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 2003 డిఎస్సీ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అ ధ్యక్షులు మడవేడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సంతోష్ కుమార్, కోశాధికారి జి. వేణుగోపాల్, విజయ్, కుమార్, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌లు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



మంత్రి కొండా సురేఖను కలిసిన దృశ్యం

హైదారాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో గురువారం సిద్దిపేట, దుబ్బాకనియోజకవర్గాలకు చెందిన ఇంచార్జిలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలపడంతో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన అరు గ్యారెంటీల హామీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని మంత్రి సూచించినట్లు తెలిపారు. నియోజకవర్గాలలో ఎలాంటి ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలని కోరినట్లు తెలిపారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

**శివ్వంపేట, జనవరి 4 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైనవారు సద్వినియోగంచేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన ఆమె అక్కడ నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సికింద్లాపూర్ గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గ్రామాలను మరింత అభివృద్ధి పరిచే లక్ష్యంగా అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తున్నామన్నారు. నర్సాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల కోసం తెలంగాణ ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాల కోసం తప్పకుండా సహకరిస్తామని తెలిపారు. అదేవిధంగా శివ్వంపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని నూతన గ్రామ పంచాయతీ భవనాలను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సికింద్లాపూర్ గ్రామంలో అధునాతనంగా పంచాయతీ భవనాన్ని నిర్మించిన సర్పంచి ఏనుగు సుధాకర్‌రెడ్డిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమణాగౌడ్, తహసీల్దార్ శ్రీనివాసచారి, ఎంపీడీవో, బిఆర్ఎస్ నాయకులు చింత స్వామి, యాదాగౌడ్, శ్రీశైలంయాదవ్ ఉన్నారు.

## ఆరు గ్యారంటీలపై ప్రజల్లో విశ్వాసం కలిగించాలి

**నేతలకు డిప్యూటీ సిఎం సూచన**

**సిద్దిపేట రూరల్, జనవరి 4, ప్రభాతవార్త:**
ఆరుగ్యారెంటీలపై ప్రజల్లో విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకులపై ఎంతైనా ఉందని డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సూచించినట్లు సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) తెలిపారు. హైదారాబాద్‌లో గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అదేశించినట్లు పేర్కొన్నారు. ప్రజా పాలనలో ప్రజలు పారదర్శకంగా వారి సమస్యలను విన్నవించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు చొరవ తీసుకోవాలని సూచించినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసి తీరుతుందని ప్రజలకు వివరించాలని డిప్యూటీ సిఎం అదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గయాజుద్దీన్, నజ్జు తదితరులు ఉన్నారు.



డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను కలిసిన కాంగ్రెస్ నేతలు

## 'ప్రజాపాలన'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. పట్టణ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి ప్రజాపాలన కార్యక్రమాన్ని అకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ పట్టణ మున్సిపల్ పరిధిలోని 43 వార్డులలో 43 కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజా పాలన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దరఖాస్తులను స్వీకరించాలన్నారు. కేంద్రాల వారీగా దరఖాస్తుల స్వీకరణ రిజిస్టర్‌లను మెయింటెనెన్స్ చేయాలన్నారు. సరిపోయే అన్ని దరఖాస్తులను అందుబాటులో ఉంచడంతో పాటు సమయపాలన పాటిస్తూ దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను అదేశించారు. గత నెల 28 నుంచి గురువారం వరకు 46,330 దరఖాస్తులను వార్డులలోని ప్రజలకు పంపిణీ చేయడం జరిగిందని ఇందుకుగానూ 27,803 దరఖాస్తులను స్వీకరించడంజరిగిందన్నారు. ఎక్కువ మొత్తంలో దరఖాస్తు ఫారాలు ప్రజల వద్దనే ఉన్నందున ప్రజా పాలన కార్యక్రమం శనివారంతో ముగియనుండడంతో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమె వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



ప్రజా పాలనలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ లోఉంచిన శ్రీధర్‌గుప్తకు చెందిన జప్తయిన కార్లు

## రైస్‌మిల్ వ్యాపారి ఆస్తుల జప్తు

**నర్సాపూర్, జనవరి 4, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన రైస్‌మిల్ వ్యాపారి ఫైడి శ్రీధర్‌గుప్త ఆస్తులను గురువారం రెవెన్యు అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జప్తు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ కమలాద్రి విలేకరులకు వివరించారు. నర్సాపూర్ పట్టణానికి చెందిన రైస్‌మిల్ వ్యాపారి ఫైడి శ్రీధర్‌గుప్త సివిల్‌సప్లయ్‌కి బకాయిపడిన రూ.47,17,36,860 బకాయిలను ప్రభుత్వానికి చెల్లించకపోవడంతో పలుమార్లు నోటీసులు జారీచేసినా ఆయన స్పందించ లేదన్నారు. ఈ మేరకు అతనిపై ఉన్నాతాధికారులు ఆర్ఆర్ యాక్టు కింద కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు. ఆర్ఆర్ యాక్టులో భాగంగా శ్రీధర్‌గుప్తకు చెందిన స్థిర,చర ఆస్తులను రికవరీ చేయాలని ప్రభుత్వ ఉన్నాతాధికారులు ఆదేశించడం జరిగిందన్నారు. ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఉదయం పోలీసుల సహకారంతో సిబ్బందితో కలిసి శ్రీధర్ గుప్త ఇంటికెళ్లి రెండు కార్లు, టివితో పాటు రెండు ఏసీలను స్వాధీనపరచుకొని జప్తు చేసినట్లు ఆయన తెలిపారు. జప్తుచేసినవాటిని పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. కాగా మిగతా ఆస్తులను ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసకుంటామని తహసీల్దార్ కమలాద్రి తెలిపారు.

## సిసి రోడ్డు నిర్మించాలంటూ ప్రజల నిరసన

**గజ్వేల్, జనవరి 4 (ప్రభాతవార్త):** పది సంవత్సరాల నుండి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులోగల ప్రధాన రోడ్డులో సిసి రోడ్డు నిర్మించాలని ప్రజలు గురువారం రోడ్డుపై అడ్డంగా రాళ్లను పేర్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుండి జగదేవ్‌పూర్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రోడ్డు ఉండగా స్థానిక ప్రజా ప్రతినిధి పట్టించుకోవడంలేదన్నారు. గతంలో రెండు పర్యాయాలు మున్సిపల్ కమిషనర్ వచ్చి చూసి వెళ్లారు కానీ రోడ్డు నిర్మాణం మాత్రం చేపట్టలేదు. సిసి రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుందన్నారు. ప్రతి ఆదివారం ఈరోడ్డులోనే సంత జరుగుతుందని, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అండర్ డ్రైనేజీ పనులు పూర్తయినప్పటికీ సిసి రోడ్డు ఎందుకు వేయడంలేదని వార్డు ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. వార్డులోని పలు వీధుల్లో సిసి రోడ్డు వేస్తున్నప్పటికీ వీధిలో ఎందుకు వేయడంలేదని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి వెంటనే సిసి రోడ్డు నిర్మాణం చేపట్టేలా కృషి చేయాలని కోరారు.



నిరసన తెలుపుతున్న 3వ వార్డు ప్రజలు



ప్రజాపాలనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

## ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలను చేరవేసేందుకే ప్రజా పాలన : ఎమ్మెల్యే సత్యనారాయణ

**బెజ్జంకి, జనవరి 4, ప్రభాతవార్త:** ప్రతి ఇంటికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేరేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమమే ప్రజా పాలన కార్యక్రమమని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని గుండారం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందాలంటే గత ప్రభుత్వంలో ఎంతో మంది దళారులు అందినకాడికి దండుకునేవారని అలాంటి దోపిడి, దళారి వ్యవస్థను రూపుమాపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నేరుగా ప్రజలు దరఖాస్తు చేసుకునేలా చేపట్టిన కార్యక్రమం ప్రజా పాలన అన్నారు. ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల్లోనే హామీ ఇచ్చిన మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరతామన్నారు. ప్రజా పాలన కార్యక్రమం ఈనెల 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని అర్హులైన నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా గ్రామస్తులు తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుగా ఆర్టీసి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తానని తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే సత్యనారాయణకు గ్రామస్తులు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు చెట్టి లావణ్య,ఎలుక లత, ఎర్రోళ్ల శ్యామ్, విష్ణు, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, ఒగ్గు దామోదర్, అరుణ్‌కుమార్, బోయినిపల్లి చందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్,రవి, వెంకటేశ్వర రావు, నాగరాజు, రాజు, ప్రవీణ్, పోచయ్య, చెన్నారెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన : ఎంపిడివో

**చిన్నశంకరంపేట,జనవరి 3,ప్రభాతవార్త:** సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన నిర్వహిస్తుందని ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని గవ్వలపల్లి తండా, కొండాపూర్, ధర్పల్లి, కొర్విపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు 394, ఇతర సమస్యలపై 140 ఆర్జిలు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి 4 ప్రభాతవార్త:** గురుకులాల్లో 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జనవరి 6వ తేదీతో ముగుస్తుందని మెదక్ తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల ప్రిన్సిపాల్ పి. వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. జనవరి 6 లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 11న నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మోడీ ఫొటో లేదని గ్రామసభను అడ్డుకున్న బిజెపి నేతలు

**ప్రభుత్వ భూమి కబ్జాచేస్తున్నా పట్టించుకోవడంలేదని అధికారిపై నేతల ఆగ్రహం**

**కౌడిపల్లి, జనవరి 4, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలనలో ప్రధాని మోడీ చిత్రపటాన్ని ఫ్లెక్సీలో ఎందుకు ఏర్పాటు చేయలేదని అధికారులను బిజెపి శ్రేణులు అడ్డుకున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గురువారం వెల్మకన్నె గ్రామంలో తహసీల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మోడీ ఫొటో లేదని సర్పంచ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు ఖాజీపేట రాజేందర్, మండల అధ్యక్షుడు రాఖేశ్ అధికారులతో వాగ్వాదం చేసుకున్నారు. దీంతో గ్రామసభకు వచ్చిన ప్రజలకు అక్కడ ఏమి జరుగుతుందో ఎవరికీ అర్థం కాలేదు. దీంతో గ్రామసభ గంట ఆలస్యంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే గృహలక్ష్మి పథకంలో కేంద్రం వాటా 60 శాతం ఉన్నప్పటికీ ప్రధాని ఫోటోను ఫ్లెక్సీలో పెట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యం అన్నారు. అలాగే పలుమార్లు మండల సర్వసభ్య సమావేశాలలో గ్రామ శివారులో ఉన్న సర్వే నంబర్ 444,447లలో ఉన్న ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేస్తున్నట్లు విన్నవించినప్పటికి సమస్యను పరిష్కరించుటలో అధికారులు ఆలసత్వం వహించడంతోపాటు తహసీల్దార్ కార్యాలయంలో పలుమార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. గ్రామ శివారులోగల ప్రభుత్వ భూమిలో అభివృద్ధి పనులకు గాని, భూమి లేని పేదలకు పంచి ఇవ్వడానికి సర్పంచ్ ఉత్సహం చూపడంలేదని వెల్మకన్నె గ్రామస్థులు నిలదీస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా అక్రమంగా కబ్జా చేసిన భూమి విస్తీర్ణంపై తహసాల్దార్ వెంటనే డిజిటల్ సర్వే చేయించి, వెల్మకన్నె గ్రామాభివృద్ధికి ఇప్పించాలని గ్రామస్తులు తహసీల్దార్ ఆంజనేయులుకు విజ్ఞప్తిచేశారు. గొడవ పెద్దగా అవుతుందని భావించి నర్సాపూర్ సిఐ షేక్‌లాల్ మదర్, చిలిపిచెడ్ ఎస్సై మహబూబ్, కౌడిపల్లి ఎఎస్సైలు విఠల్, శ్రీనివాస్‌తో కలిసి వెల్మకన్నె గ్రామ సభకు విచ్చేసి సమావేశాన్ని శాంతియుతంగా నిర్వహించేలా పర్యవేక్షించారు. స్పందించిన తహసీల్దార్ ఆంజనేయులు గ్రామసభలు ముగిసిన తర్వాత ఆర్ఐతో కలిసి కబ్జాకు గురైనా భూములను పరిశీలించి న్యాయం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రాఖేశ్, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలనలో పిఎం చిత్రపటాన్ని ఫ్లెక్సీలో ఏర్పాటుచేయలేదని అధికారులను నిలదీసిన బిజెపి శ్రేణులు



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వల్లూరి క్రాంతి

## కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతి

**సాదరంగా స్వాగతించిన అధికారులు**

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 4, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్‌గా వల్లూరి క్రాంతి గురువారం పదవీ బాధ్యతుల స్వీకరించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న వల్లూరి క్రాంతిని అధికారులు సాధరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో విద్యా, వైద్య, మహిళా శిశు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజా పాలన ద్వార ప్రభుత్వ పథకాలు అధికారుల సమన్వయంతో ప్రజలు అందుకునేలా చేస్తామన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతికి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురి, జిల్లా రెవిన్యూ అధికారి నగేష్, ఆయా శాఖల అధికారులు, పత్రిక విలేఖరులు, కలెక్టర్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలుసుకుని పూల బొకేలను అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## దరఖాస్తుల స్వీకరణ సజావుగా సాగాలి

**-జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి**

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 4, ప్రభాతవార్త:** ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలు అందించే ధరఖాస్తుల స్వీకరణ సజావుగా సాగేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. జిల్లా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే కలెక్టర్ వల్లూరి క్రాంతి తన కార్యాలయం నుంచి నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు ఎంపిడిఓ, తహసీల్దార్‌లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 16వ తేదీ నాటికి ప్రజలు అందచేసిన ధరఖాస్తులను డేటా ఎంట్రీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభల్లో ధరఖాస్తుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డేటా ఎంట్రీకి ఆపరేటర్లకు ముందస్తు ప్రణాళిక చేసుకోవాలన్నారు. ప్రజలు అందచేసిన ప్రతాలకు అనుగుణంగా ఎంట్రీ చేయాలని, తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు అందించిన ఏ ఒక్క ధరఖాస్తు మిస్ కాకుండా చూడాలని, ప్రజలవద్ద దరఖాస్తులు అందచేసినట్లు రశీదులు ఉన్న విషయాన్ని అధికారులు గుర్తించుకోవాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఈ నెల 5న శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వల్లూరి క్రాంతి పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, డిఆర్ఓ నగేష్, రెవిన్యూ డివిజన్ అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి గిన్నిస్ బుక్ అందించిన జడ్జ్ కృష్ణతేజ




గ్రంథాలయ ఇంచార్జికి బుక్ అందిస్తున్న జూనియర్ సివిల్ జడ్జ్ కృష్ణతేజ

**హుస్నాబాద్, జనవరి 4,ప్రభాతవార్త :** అలయన్స్ క్లబ్ ఆఫ్ హుస్నాబాద్ డైమండ్స్ ఆధ్వర్యంలో గురువారం హుస్నాబాద్ కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ 2024కు సంబంధించిన ప్రపంచ గిన్నిస్ రికార్డు బుక్‌ను కోర్టులో గ్రంథాలయ ఇంచార్జ్ ఎనుముల ఉమాపతికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లైబ్రరికీ వచ్చే, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్న అభ్యర్థులు గిన్నిస్ బుక్ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ చార్టర్ వ్యవస్థాపక అధ్యక్షులు, సామాజిక సేవా అవార్డుగ్రహీత దూడం నాగభూషణంతో పాటు సంఘం అధ్యక్షులు గాజుల భగనాన్‌తో వెల్దండి లక్ష్మీపతి,చందుల వీరసోమయ్య,లోక్ అధాలత్ సభ్యులు చిత్తారి రవిందర్,అడ్వేజర్స్ దేవేందర్, ఎల్లారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో కాడెద్దు మృతి

**జగదేవ్‌పూర్, జనవరి 4(ప్రభాతవార్త):** ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో కాడెద్దు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... గ్రామానికి చెందిన రైతు తీగుళ్ల సుధాకర్‌కు చెందిన కాడెద్దు గురువారం మధ్యాహ్నం మేతకోసం వెళ్లి ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. అప్పుచేసి ఎద్దులను కొనుగోలుచేయడం జరిగిందని, ఎద్దు మృతిచెందడంతో రూ.80వేల నష్టం జరిగిందని రైతు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు సుధాకర్ కోరారు. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ మహేందర్ రైతును పరామర్శించి ధైర్యం చెప్పారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**రూ. 6 లక్షల మేర ఆస్థినష్టం**

**నిజాంపేట, జనవరి 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో బుధవారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయింది. గ్రామానికి చెందిన పందిరి రుక్మయ్య నివాసంలో అర్ధరాత్రి 2 గంటల సమయంలో విద్యుత్‌షాక్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అవుతుండగా ఇరుగు పొరుగువారు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌గౌడ్ పంచనామ నిర్వహించి మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో ఇంట్లో ఉన్నటువంటి సామాన్లు పూర్తిగా కాలిపోయాయని, సుమారు 6 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, ఇట్టి నివేదికను పై అధికారులకు పంపిస్తామని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో షాక్ సర్క్యూట్ జరగడంతో ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించేలా చూడాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకున్నారు.



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

## బాధిత కుటుంబాలకు ఎస్‌కేఆర్ ట్రస్ట్ ఆర్థిక సాయం

**మర్పల్లి జనవరి 4 ప్రభాతవార్త:** మర్పల్లి మండలంలోని పట్లూర్ గ్రామానికి చెందిన ఎర్రగొల్లరుక్కమ్మ గురువారం మృతి చెందింది అలాగే నర్సపూర్ గ్రామానికి చెందిన బోయిని రాములు మరణించాడు అట్టి విషయం తెలుసుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ చైర్మెన్ జిల్లా గ్రందాలయ మాజీ చైర్మెన్ సనగారి కొండల్‌రెడ్డి వారి అంత్యక్రి యలకు ఒకరికి 5000వేల రూపాయల చొప్పున 10వేల రూపాయలు పంపగా, ఆయా గ్రామాల యాయకులు మృతుల కుటుంబ సభ్యుల నుపరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

## కాచారం పాఠశాలలో తొలిమెట్టు అమలు భేష్
### జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



ప్రత్యేకంగా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

**ధారూర్, జనవరి 4 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాచారం ప్రాథమిక పాఠశాలలో తొలిమెట్టు భేషుగ్గా అమలు చేస్తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కొనియాడారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివాణితో ఫోన్‌లో వీడియో కాల్ మాట్లాడారు. విద్యార్థులకు సులబంగా పాఠాలు అర్థమయ్యేలా వారి నైపుణ్యం పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక పద్ధతుల్లో విద్యాబోధన చేయడాన్ని అభినందించారు. వీడియో కాల్ చేసి విద్యార్థులతో సునీతారెడ్డి మాట్లాడారు. టీఎల్‌ఎం పద్ధతిలో చెప్పే విద్యాబోధన తమకు పాఠాలు బాగా అర్థం అవుతున్నాయని విద్యార్థులు సునీతారెడ్డికి తెలిపారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలని సూచించారు. మొదటి రెండు తరగతుల విద్యార్థులు కూడా ఇంగ్లీషు భాషలో మాట్లాడడంపై సునీతారెడ్డి ముగ్దురాలయ్యారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయురాలు శివాణిని, ఉపాధ్యాయురాలు అనురాధను ప్రత్యేకంగా అభినందించారు.

## భూగర్భ వంతెనల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం: నేషనల్ హైవే అధికారి రజాక్



అవుశాపూర్ అండర్‌పాస్ వద్ద జాతీయ రహదారుల ఆర్‌వో రజాక్‌కు సమస్యలు వివరిస్తున్న ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 4, ప్రభాత వార్త:** వరంగల్ జాతీయ రహదారిపై నిర్మించదలిచిన భూగర్భ వంతెన నిర్మాణపనులను త్వరలో ప్రారంభిస్తామని జాతీయ రహదారుల రీజనల్ అధికారి రజాక్ అన్నారు. ఘట్‌కేసర్ మండలంలోని అవుశాపూర్, అంకుశాపూర్, అన్నోజిగూడలోని ఎన్‌టీపీసీ చౌరాస్తాల్లో భూగర్భ వంతెన నిర్మాణ పనుల స్థలాలను గురువారం జాతీయ రహదారుల రీజనల్ అధికారితో పాటు పీడీ సుజాత, స్థానిక ఎంపీపీ, రాష్ట్ర బీజేపీ నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డిలు సందర్శించారు. భూగర్భ వంతెన నిర్మాణం చేపట్టాల్సిన స్థలాలతో పాటు అవుశాపూర్ వద్ద అండర్‌పాస్ రోడ్డు నిర్మాణం కాకుండా వదలివేసిన వైనాన్ని అధికారులకు ఎంపీపీ వివరించారు. వర్షాలకు ధ్వంసమైన రోడ్డు విషయమై వివరించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారుల రీజనల్ అధికారి రజాక్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా కొన్ని మార్పులు చేశామని తెలిపారు. భూగర్భ వంతెన నిర్మాణ పనులు సైతం అతి తొందరలోనే ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఏనుగు కావేరి, కౌన్సిలర్లు బాలగోని వెంకటేశ్ గౌడ్, ఎం. పద్మారావు, జాతీయ రహదారుల డిప్యూటీ మేనేజర్ నవకాంత్, ప్రాజెక్టు మేనేజర్ తేజనిధి, టీఎల్. శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ నాయకులు ఏనుగు మశ్చేందర్ రెడ్డి, జీవన్ రెడ్డి, శివనాయక్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## జన్య పౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



అంకుశాపూర్ టీఎస్ సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 4, ప్రభాత వార్త:** అంకుశాపూర్‌లోని టీఎస్ సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో జన్య పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎఆర్. లక్ష్మి తెలిపారు. ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్‌లోని ప్రిన్సిటన్ కళాశాల భవనంలో నడపబడుతున్న జగద్గిర్‌గుట్ట ప్రభుత్వ సాంఘీక సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు గురువారం రంగోలి పోటీలు నిర్వహించారు. జన్య ల్యాబ్ ఇన్ ఎ బాక్స్ కార్యక్రమంలో జన్య పౌండేషన్ వారు రంగోలి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సంస్థ అందజేసిన భోధనా, అభ్యాసన పరికరముల ద్వారా తరగతి గదిలో అభ్యాసనల ద్వారా నేర్చుకున్న సైన్స్, గణిత అంశాలను విద్యార్థులు ముగ్గుల రూపంలో ప్రదర్శించినట్లు తెలిపారు. రంగోలి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు పేర్కొన్నారు. రామకృష్ణ, యాదయ్య, మిలాన్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలి

**ఘట్‌కేసర్, జనవరి 4, ప్రభాతవార్త:** పిల్లలను రోగాల నుంచి కాపాడేందుకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలను వేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 16వ వార్డు బాలాజీనగర్‌లోని బస్తీదావాఖానాను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె వైద్యులు, ఆశావర్కర్లను అడిగి టీకాల పంపిణీని తెలుసుకున్నారు. ప్రతిచిన్నారికి వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఆమె సూచించారు. పిల్లలకు తల్లులు సకాలంలో బస్తీదావాఖానాకు వచ్చి వ్యాధినివారణ టీకాలను వేయించాలని సూచించారు.



స ంకేపల్లిగూడలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్



ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరిస్తున్నా సర్పంచ్ స్ఫూర్తి, కార్యదర్శి స్వప్న



మేకగూడ దరఖాస్తు చేసుకున్న రసీదులను చూపిస్తున్న సర్పంచ్ పాండురంగారెడ్డి



ఆమనగల్లులో ప్రజాపాలన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఫరీద్

# కొనసాగుతున్న ప్రజాపాలన

## దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

### ఆర్భాటాలు తప్ప బిఆర్ఎస్ చేసింది ఏమీలేదు

**నందిగామ, జనవరి 4 ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్భాలాలు చేసిందేతప్ప ఆస్తులు సృష్టిం చలేదని, ఏలాంటి అభివృద్ధి చేయలేదని మేకగూడ సర్పంచ్ పాండురంగారెడ్డి అన్నారు. గురువారం నందిగామ మండలం మేకగూడలో కొనసాగుతున్న ప్రజాపాలనలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం అభ్యయస్థం పథకం ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేకగూడలో గురువారం నాటికి అర్హులైనవారందరి నుంచి ఇప్పటివరకు 660 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నగేష్ గౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

### ఆమనగల్లులో..

**ఆమనగల్లు, జనవరి04, ప్రభాతవార్త:** ఎన్నికల ముందు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు ఎండి ఫరీద్, యువజన కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు ఎంఏ రఫీ అన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే ప్రజల చెంతకు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తుండడం గర్వకారణమని వారు కొనియాడారు. గురువారం ప్రజా పాలన శిబిరాలను సందర్శించి హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు ఉత్సాహంగా ముందుకు వచ్చి అభయహస్తం పథకం క్రింద దరఖాస్తులు చేసుకుంటున్నారన్నారు.

### అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు
#### మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్

**చౌడపూర్ జనవరి 4 ప్రభాతవార్త** రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందిస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ కుమార్ అన్నారు. ప్రజలకు సేవకులుగా కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీనాయకులు పనిచేస్తున్నామని అశోక్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని మక్త వెంకటాపూర్, ఈర్లవాగు తండా గ్రామ పంచాయతీలలో ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఎమ్మార్వో ప్రభులు మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లింగప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాము, పంచాయతీ కార్యదర్శులు మహేష్‌రెడ్డి, శైలజ నాయ కులు వెంకట్ శంకర్ రాములు సర్పంచ్ అనిత గ్రామపంచా యతీ నీల్య వాల్యా, రాజు, చాకల్‌పల్లి గ్రామంలో సర్పంచ్ రాములమ్మ, శేఖర్, బద్రి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### బంట్వారంలో..

**బంట్వారం, జనవరి 04 (ప్రభాతవార్త) :** రాష్ట్రంలోని ప్రతి కుటంబానికి సంక్షేమ పథకాలు అందివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ స్ఫూర్తి అన్నారు. గురువారం మండల పరిధిలోని తొరుమామిడి, సల్బత్తాపూర్ గ్రామాల్లో 'ప్రజాపాలన' గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రభుత్వ పథకాలు అందరికి అందించాలని ఈ గ్రామ సభలను నిర్వహిస్తుందని చెప్పారు. సర్పంచ్ వెంకటమ్మ స్థానిక తహాసీల్దార్ ప్రవీన్‌కుమార్, సుపరిండెంట్ సుశీల్‌కుమార్ షిండే, ఇతర అధికారులతో పాటు డీసీసీ కార్యదర్శి రంగారెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్, వీరేశం, పంది వెంకటయ్య, ఇసాక్, ఆలంపల్లి శ్రీనివాస్, ఎల్లయ్య, సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లెడు చౌదరిగూడలో..

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 04,(ప్రభాతవార్త):** అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపిడిఓ మహేష్‌బాబు అన్నారు. గురువారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల, ధర్మ్యతాండ, రావిర్యాల, తూంపల్లి గ్రామాల్లో ప్రజా పాలన గ్రామసభ నిర్వహించారు. తహసీల్దారు విజయ్‌కుమార్, ఏపిఒ ప్రవల్లిక, ఎపిఎం రామస్వామి, ఎంపిఓ విజయ్‌కుమా ర్‌పాల్, సర్పంచ్‌లు కమ్మరి భూపాలచారి, లక్ష్మీదేవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

### షాబాద్‌లో..

**షాబాద్, జనవరి 4, ప్రభాతవార్త :** ఈనెల 6వ తేది వరకు ప్రజాపాలన దరఖాస్తులు చేసుకోవాలని సర్పంచ్ బండ స్వర్ణలతసతీష్‌యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు తదితరులున్నారు.

### కీసరలో..

**కీసర, జనవరి4, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి సూచించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులోని రామక్రిష్ణనగర్ కాల నీలో, 15వ వార్డు ఈస్ట్ గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో, 20వ వార్డు గోపిక్రిష్ణనగర్ కాలనీ మేదర్ సం క్షేమ సంఘం నందు ప్రజా పాలన సభలను నిర్వ హించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజా పాలన ధరఖాస్తులు ఈ నెల 6వ తేదీ వరకు ప్రతి ఒక్క వార్డులో అందుబాటులో ఉంటాయని అర్హులైన లబ్దిదారులు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్, మున్సిపల్ కమీషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్ గౌడ్, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, అన్నంరాజు సుమిత్ర, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలకు అర్హులు ధరఖాస్తు చేసుకొండి

**ఘట్‌కేసర్, జనవరి 4, ప్రభాతవార్త:** వివిధ సంక్షేమ పథకాలకు ప్రజలు అభయహస్తం ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి మహిపాల్‌గౌడ్ అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్ మున్సిపల్ 2వ వార్డులోని ఎన్‌ఎఫ్‌సీనగర్ కమ్యూనిటీహాలులో గురువారం ఆమె వార్డు అధికారి సందీప్‌తో కలిసి అభయ హస్తం ధరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 5గ్యారెంటీలలో మహాలక్ష్మి, గృహలక్ష్మి, చేయూత, ఇందిరమ్మఇండ్లు, రైతుభరోసా పథకాలకు సంబంధించి అర్హులైన వారు ధరఖాస్తులను అందజేయాలన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులో గురువారం మొత్తం 710 ధరఖాస్తులు అందాయని కమీషనర్ సాబేర్‌ఆలీ తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్యఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ విమలరెడ్డి, మాజీ వార్డుసభ్యురాలు విమల, ఆర్‌పీ కన్యాకుమారీ, ఆశావర్కర్ మేఘమాల, వార్డు బీఆర్‌ఎస్‌పార్టీ అధ్యక్షులు జనగామ యాదగిరిరావు, నాయకులు బొడిగె అంజనేయులుగౌడ్, సల్ల శివ, సలీం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ మహేష్‌బాబు



ఆదర్శనగర్ కాలనీలో దరఖాస్తుల స్వీకరణను అడిగి తెలుసుకుంటున్న సీనియర్ నాయకులు రఫీ



ప్రజా పాలనలో భాగంగా దరఖాస్తులను స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



ఎన్‌ఎఫ్‌సీనగర్ కమ్యూనిటీహాలులో ధరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ రమాదేవి, ఇంచార్జ్ సందీప్

## రామ మందిర అక్షింతలు, గుడి కరపత్రాల వితరణను విజయవంతం చేయాలి

**చేవెళ్ల, జనవరి 4 ప్రభాతవార్త :** అయోధ్య రామ మందిర అక్షింతల, గుడి కరపత్రాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....నేడు చేవెళ్ల మండల కేంద్రంలో శ్రీ రామ జన్మభుమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో అయోధ్య రామమందిర అక్షింతలు, గుడి కరపత్రాలను గడపగడపకు అందజేయనున్నారని తెలిపారు. నేడు ఉదయం 8 గంటల నుండి చేవెళ్ల గ్రామంలోని శ్రీరామ భక్త హనుమాన్ మందిరం వరకు మేళతాళాలతో, భాజా భజంత్రీలతో శ్రీరామ నామ సంకీర్తనలతో భవ్య స్వాగతం పలకాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. కావున ప్రతి ఒక్కరూ భవ్య శోభయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం తరువాత గ్రామంలోని ప్రతి ఇంటికి అక్షింతలు, గుడి చిత్రపటాల, కరపత్రాల వితరణ చేయడం జరుగుతుందన్నారు.

## ఆరు గ్యారంటీలు పక్కగా అమలు
### చేవెళ్ల నియోజకరవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్



పామెన భీంభరత్‌ను సన్మానిస్తున్న రేగడిఘణాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు

**చేవెళ్ల, జనవరి 4 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పక్కగా ఆమలు చేస్తుందని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్ అన్నారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని రేగడిఘణాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ భీంభరత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల కాంగ్రెస్ పార్టీ అధికారంకు దూరమైందని, ప్రజా సమస్యలను పరిష్కారం చేసేందుకే ప్రజా పాలన కార్యక్రమం తీసుకువచ్చిందన్నారు. గ్రామాల్లో జరిగే గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 6వ తేది వరకు గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమ సభలు జరుగుతాయన్నారు. తర్వాత కూడా మండల కార్యాలయాల్లో కూడా సమస్యలపై పిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. ప్రతి 4 నెలలకొకసారి గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. చివరి రోజు 6వ తేది ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్ రానున్నారని కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు ఈదుపల్లి రాములు తెలిపారు. జిల్లా, మండల పార్టీ కమిటీ, అనుబంద సంఘాల నాయకులు, పార్టీ అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిప్పని అంజిరెడ్డి, రాములు, రాజేష్, హారీశ్వర్‌రెడ్డి, అంజిరెడ్డి, కృష్ట, మాణయ్య, యాదయ్య, దయానంద్, జంగయ్య, రాములు, జంగయ్య, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పైల్ నెం : 03

## విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడేది ఎస్‌ఎఫ్‌ఐ
### ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బేగరి అరుణ్‌కుమార్, ఎర్రవల్లి శ్రీనివాస్

**చేవెళ్ల, జనవరి 4 ప్రభాతవార్త :** విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడేది ఎస్ఎఫ్ఐ అని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బేగరి అరుణ్‌కుమార్, ఎర్రవల్లి శ్రీనివాస్‌లు అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ విద్యార్థులకు ఎల్లవేళల అందుబాటులో ఉంటుందన్నారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చిన ఆ సమస్య పరిష్కారం కోసం ముందుండి పోరాడే సంఘం ఎస్ఎఫ్ఐ సంఘం అని తెలిపారు. కావున అందరూ ఎస్ఎఫ్ఐలో భాగస్వామ్యం కావాలని, అందరూ మెంబర్‌షిఫ్ తీసుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ ఐ నాయకులు శివ, కుమార్, రవి, నారాయణ, రమ్య, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



కీసరలో అయోధ్య శ్రీ రామ అక్షింతల శోభాయాత్రలో పాల్గొన్న సర్పంచ్ నాయకపు మాధురి, గ్రామ పెద్దలు, భక్తులు

## కీసరలో ఘనంగా అయోధ్య శ్రీరామ అక్షింతల శోభాయాత్ర

**కీసర, జనవరి4, ప్రభాతవార్త:** అయోధ్య రామయ్య అక్షింతల కలశాల శోభాయాత్ర మండల కేంద్రమైన కీసరకు గురువారం చేరుకున్నాయి. గ్రామానికి చేరుకున్న అక్షింతల కలశాలకు గ్రామ దేవత బంగారుమైసమ్మ ఆలయం వద్ద స్వాగతం పలికిన గ్రామ సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్, గ్రామ పెద్దలు, పుర ప్రముఖులు, భక్తులు మంగళ వాయిద్యాలతో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయానికి ఊరేగింపుగా తెచ్చి పూజలు నిర్వహించారు. భక్తులు కాశాయ జెండాలతో జై శ్రీ రాం నినాదాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. శుక్రవారం నుండి కీసరలో పవిత్ర శ్రీ రామ అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేయనున్నట్లు శ్రీ రామ జన్మభూమ తీర్ధ క్షేత్ర ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామడి విజయ్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి. వైస్ ఎంపిపి సత్తిరెడ్డి, ఎంపిటిసి నారాయణశర్మ, మాజీ ఎంపిటిసి బెలిదె రమేష్ గుప్తా, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు జూపల్లి రవీందర్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## సామాజికసేవలో ఎఐపిఐఎఫ్ సేవలు ప్రశంసనీయం



ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రిలో రోగులకు అల్పాహారం అందజేస్తున్న కౌన్సిలర్ మల్లేశ్, అబ్దుల్‌ఖయ్యూమ్

**ఘట్‌కేసర్, జనవరి 4, ప్రభాతవార్త:** సమాజసేవలో ఎఐపిఐఎఫ్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయం ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిలర్ కడుపోల్ల మల్లేశ్ అన్నారు. ఘట్‌కేసర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో ఆల్‌ఇండియా పేయెమ్-ఇ- ఇంసానియట్ ఫోరమ్ (ఎఐపిఐఎఫ్) ఈస్ట్ జోన్ అధ్యక్షులు మౌలానా సయ్యద్ కుతుబుద్దీన్ ఆదేశాల మేరకు రోగులకు అల్పాహారం పంపిణీ చేశారు. కౌన్సిలర్ మల్లేశ్, మైనారిటీ నాయకులు ఎం. అబ్దుల్‌ఖయ్యూమ్‌ల చేతుల మీదుగా ఆసుపత్రికి చికిత్సకు వచ్చిన గర్భిణీస్త్రీలు, పిల్లలకు ఉప్మాను అందజేశారు. ఎఐపిఐఎఫ్ ద్వారా వేసవికాలంలో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చారని, ప్రభుత్వ ఆసుపత్రిలో వారంలో మూడు రోజుల పాటు ఉదయం రోగులకు ఉప్మా తయారు చేసి అత్పాహారంగా అందజేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎఐపిఐఎఫ్ సభ్యులు అజీమ్, వాలీంటర్లు మౌలానాసయ్యద్‌నాజ్వీ, రఫీక్, ఫాసీ, జునేద్, రియాజ్, రెహమాన్, ఎండి. మసుం, ఎస్‌కె. రియాజ్, షైబాద్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

**శంకర్‌పల్లి, జనవరి 04 ప్రభాతవార్త:** శంకర్‌పల్లి మండలం అనంతప్పగూడకు చెందిన హరిజన్ లక్ష్మి (33) కనిపించకుండా పోయింది. గత ఏడాది డిసెంబర్ 6 నుంచి కనిపించకుండా పోయిందని అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు




తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం, సర్పంచ్

## బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

**షాబాద్, జనవరి 4, ప్రభాతవార్త :** బడీడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని షాబాద్ మండల నోడల్ అధికారి, సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, కుర్వగూడ సర్పంచ్ బుయ్యని సంధ్యారాణిమల్లిఖార్జున్‌గౌడ్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో ఆకృతి ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ, కోఆప్టటెడ్ మెంబర్ దాదె మహేష్‌లతో ఆధ్వర్యంలో పాఠశాలకు సరిగ్గా వెళ్లని విద్యార్థుల గురించి గ్రామంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... నిరక్షరాస్యత నిర్మూలన, విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు తమవంతు పాలు పంచుకోవాలన్నారు. పిల్లలను బడిలో చేర్పిస్తేనే వారికి మంచి భవిష్యత్‌ను చూపిన వారమవుతమన్నారు. బడీడు పీల్లలందరిని బడిలో చేర్పించి, భావిపౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులందరిని పాఠశాలకు పంపె బాధ్యత తల్లిదండ్రులపైన ఉందన్నారు. విద్యార్థులు చదువుకోవడంతో ఆర్థికంగా ఎదుగుతారని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు యువకులు, గ్రామస్థులు నడుంబిగించాలన్నారు. దేశభవిష్యత్తు, సమాజ భవిష్యత్తు విద్యార్థుల చేతిలో ఉంటుందని, సమాజంలో చదువు ఎంతో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరు చదువుకోవాలని సూచించారు. గ్రామస్థులు నర్సింలు, వెంకటేష్ ఉన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

**యాచారం జనవరి4, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు వారి తల్లి రాచర్ల ఈశ్వరమ్మ జ్ఞాపకార్థంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్యార్థులకు తమ ఉజ్వల భవిష్యత్తు విద్యతోనే సాధ్యమని తెలిపారు. తద్వారా గ్రామానికి, మండలానికి వారి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు సంపాదించేలా చదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి లక్ష్మీపతి గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు కానమోని జంగయ్య, కొండల్, వెంకటయ్య, హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు, శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎడ్ల రమేష్

## బీరంగూడలో ప్రభుత్వ భూములను కాపాడండి

**అమీన్‌పూర్, జనవరి 4 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ శివాలయం శివారులో ప్రభుత్వ భూమి 993 సర్వే నెంబర్‌లో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తహసీల్దార్‌కు ప్రజలతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండ్ల రమేష్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను కోరడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూములను కాపాడే బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉందన్నారు. గతంలోనూ ప్రజలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేయడం జరిగిందని ఆయన చెప్పుకొచ్చారు. గతంలో కూల్చివేతలు జరిగినా, మళ్లీ యధావిధిగా అక్రమ నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని అక్రమ నిర్మాణాలను అరికట్టి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**మెదక్ మున్సిపాలిటీ, జనవరి 4 ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్టీయూ టీఎస్ మెదక్ జిల్లా క్యాలెండర్‌ను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి, ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్ నందు జిల్లాను ఉత్తమస్థానంలో ఉండేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాజగోపాల్‌గౌడ్, పోచయ్య, రాష్ట్ర కార్య దర్శి ఎర్ర రాజు, కిష్టయ్య, భూపతిగౌడ్, రేఖ, లక్ష్మీప్రసన్న, అశోక్, అరుణ్‌కుమార్, రాఘవరావు, దిలీప్‌కుమార్, కిష్టయ్య, దుర్గరాములు, ఎల్ల, వేణుగోపాల్, శివప్రసాద్, గొర్ర శ్రీనివాస్, శ్రీకాంత్, నర్సాగౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

**టిపిటిఎఫ్ క్యాలెండర్...**

**కంది, జనవరి 4, ప్రభాతవార్త:** టిపిటిఎఫ్ క్యాలెండర్‌ను చేర్యాల గ్రామంలోని ఉన్నతపాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు వెంకట రాజయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ నాయకులు సోమశేఖర్ మాట్లాడుతూ 5 సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు మొదటి తేదీన వేతనాలు అందక అవస్థలు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అయినా 1వ తేదీన అందుతాయన్న ఆశతో ఉన్నామని, ప్రభుత్వం మార్పు తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేజీబీవి, సర్వశిక్ష ఉపాధ్యాయులకు గత మాసంకు సంబంధించిన వేతనాలు ఇంకా అందలేదని విచారం వ్యక్తం చేశారు. వేతనాలు సకాలంలో అందేలా బాధ్యులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిటిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ యం సోమశేఖర్, మండల అధ్యక్షులు సి జనార్ధన్, ప్రధాన కార్యదర్శి సిద్దేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు శివ్వంపేటలో ఎల్ఈడీ లైట్ల ప్రారంభోత్సవం

**శివ్వంపేట, జనవరి4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, సర్పంచి పత్రాలు శ్రీనివాస్‌గౌడ్‌లు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. చాలాకాలంగా ఎదురుచూస్తున్న స్థానికుల కోరిక నెరవేరుతుందని వారు అభిప్రాయపడ్డారు. ప్రజల సంక్షేమం కోసం తారు అహర్నిషలు కృషి చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా తాను అనునిత్యం మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని మహేష్‌గుప్త చెప్పారు. ఏ గ్రామంలో అయినా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. తాము ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## కష్టపడితే మహిళలే ముందుంటారు: ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, జనవరి 4 ప్రభాతవార్త:** ప్రభుత్వం నెలకొల్పిన ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్‌లోని వెలుగు కార్యక్రమంలో మహిళలకు ఉచిత టైలరింగ్ నిర్వహించినకార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. జీవితంలో మహిళలు కష్టపడి వ్యాపార రంగాల్లోను ప్రభుత్వం నిర్వహించిన ఆయా కోర్సుల్లోమంచిప్రతిభను కనబర్చలని అన్నారు. మండల మహిళా సమాఖ్యకు తాను పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా వంద రోజుల పని పూర్తి చేసిన వారికి కుట్టుశిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం టిక్యానాయక్, వంశీకృష్ణ, రవింద్‌నాయక్, రమేష్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



పెద్దచింతకుంట గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ శివకుమార్

**నర్సాపూర్, జనవరి 4, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దచింతకుంట గ్రామ సర్పంచ్ గుండెశివకుమార్ తెలిపారు. గురువారం పెద్దచింతకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సర్పంచ్ గుండె శివకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు దరకాస్తు చేసుకోవాలన్నారు. ఈమేరకు ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజలు వచ్చి దరకాస్తులు ఇచ్చి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో మార్టిన్ లూథర్, విధ్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్, మండల పరిషత్ సూపరిండెంట్ మనోహర్, గ్రామ నాయకులు మాణయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిసల్ చైర్మన్ పదవికి మురళీధర్‌యాదవ్ రాజీనామా

**నర్సాపూర్, జనవరి 4, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు మురళీధర్‌యాదవ్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్‌లు కొద్దిరోజుల కిందట తనపై అవిశ్వాసంతీర్మానం పెట్టాలని నోటీసులు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు అందజేశారన్నారు. తనపై అవిశ్వాసం పెట్టకముందే స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు పంపించడం జరుగుతుందన్నారు. ప్రజలు తనపై నమ్మకం, విశ్వాసం ఉంచి మొదటి నుండి సర్పంచ్‌గా, కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా గెలిపిస్తు వస్తున్నారని వారికి రుణపడి ఉంటానని తెలిపారు. పదవీ ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు. అంతేగాక అజయ్ ట్రస్ట్ ద్వార ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బుచ్చేష్‌యాదవ్, గోడ రాజేందర్, ఎరుకలి యాదగిరి, సంగసాని సురేశ్, లతరమేశ్‌యాదవ్, బిజెపి నాయకులు పాపగారి చిన్న రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీధర్‌యాదవ్



బెల్లాపూర్ ప్రజా పాలన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఖమ్మంపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జడ్పీటీసీ పైతర మీనాక్షి



తక్కడపల్లి ప్రజా పాలనలో ధరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



ధన్వార్‌లో ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్



హత్నూర గ్రామసభలో పాల్గొన్న అవుల రాజిరెడ్డి



దయారా గ్రామంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్న దృశ్యం

# గ్రామాల్లో కొనసాగుతున్న 'ప్రజాపాలన'

**మనూర్, జనవరి 4, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందచేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బెల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజల అవసరాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రజల చెంతకు వచ్చి ధరఖాస్తులు స్వీకరిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ నెల 6వ తారీఖు వరకు ధరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతిపక్షాలు ఆశ్యర్యపోయేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శార్జిలోద్దిన్, ఎంపిటిసి సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దిగంబర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**తక్కడపల్లిలో...**

**మునిపల్లి, జనవరి 4, ప్రభాతార్త:**
మండలంలోని తక్కడపల్లిగ్రామంలో గురువారం ప్రజాపాలన గ్రామసభను నిర్వహించారు. గ్రామసభలో ప్రజలు అందచేసిన దరఖాస్తులను అధికారులు స్వీకరించి రశీదులను అందచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తెన్మోజి, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**ధన్వార్‌లో...**

**మనూర్, జనవరి 4, ప్రభాతవార్త:**
మండలంలోని ధన్వార్ గ్రామంలో గురువారం ప్రజాపాలన గ్రామసభను నిర్వహించారు. సభలో ప్రజలు అందచేసిన దరఖాస్తులను తహసీల్దార్ మల్లేష్‌కుమార్ స్వీకరించి రశీదులు అందచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీవరకు ప్రజలు 5 గ్యారంటీలకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుల్జమ్మ సిద్దేశ్వర్, పంచాయితీ కార్యదర్శి ప్రశాంత్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**హత్నూర మండలంలో...**

**హత్నూర జనవరి 4 : ప్రభాతవార్త:**
ప్రజాపాలన గ్రామసభలను గురువారం హత్నూర మండలంలో అధికారులు నిర్వహించారు. మండలంలోని సిరిపురం, దేవునిగుట్టతండా, సికింద్లాపూర్, నాగుల్ దువులపల్లి, తెల్లరాళ్లతాండ, నస్తీపూర్‌లలో గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభలకు హాజరయ్యే ప్రజలు ఇచ్చే దరకాస్తులను స్వీకరించడానికి ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేశారు. అలాగే సిరిపురం, తెల్లకాళ్ల తండా, సికింద్లాపూర్ గ్రామంలో జరిగిన గ్రామసభలను టిపిసిసి ప్రధాన కార్యాదర్శి అవుత రాజిరెడ్డి సందర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఆంజనేయలుగౌడ్, సుహాసినిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శేషసాయిరెడ్డి, కొన్యాల వెంకటేశం, ఎం.ఎ.హాకీమ్, కృష్ణ, సత్యం పాల్గొన్నారు.

**దయారా గ్రామంలో...**

**అమీన్‌పూర్, జనవరి 4 ప్రభాతవార్త:**
పేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారెంటీల అమలులో భాగంగా గురువారం అమీన్‌పూర్ మండలం దయారా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో సర్పంచి భాస్కర్‌గౌడ్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి రసీదుల అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ అమల్లో భాగంగా వివిధ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశ్వర్, స్థానిక నాయకులు, పంచాయితీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపాలనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్**

**మెదక్ అర్బన్, జనవరి 4 ప్రభాతవార్త:**
మెదక్ పట్టణంలోని 19, 20వ వార్డుల్లో గురువారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, స్థానిక కౌన్సిలర్లు వంజరి జయరాజ్, నర్వ లక్ష్మీనారాయణగౌడ్, మున్సిపల్ కమీషనర్ జానకిరామ్‌సాగర్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ఖమ్మంపల్లిలో...**

**మునిపల్లి, జనవరి 4, ప్రభాతవార్త:**
అర్హులందరూ ప్రభుత్వం అందించే 5 సంక్షేమ పథకాలలో లబ్దిపొందేందుకు ఈ నెల 6వ తేదీ వరకు ప్రజలు దరఖాస్తులను అందచేయాలని జడ్పీటిసి సభ్యురాలు పైతర మీనాక్షిసాయికుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలో జడ్పీటిసి పైతర మీనాక్షి సాయికుమార్ పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన హామీలను వెంటనే అమలుచేయాలని జడ్పీటిసి సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పైతర సాయికుమార్, డిప్యూటీ తహసీల్దార్ కృపానందం, ఎంఈఓ దశరథ్, ఎంపిటిసి సభ్యులు శివలీల, సర్పంచ్ యండి జాస్మిన్, ఉప సర్పంచ్ శాంతమ్మ, రైతుబంధు అధ్యక్షులు యాదయ్యగౌడ్, మాజీ ఉప సర్పంచ్ తుడుం దుర్గయ్య, పంచాయితీ కార్యదర్శి శివకుమారి, బిఆర్ఎస్ నాయకులు మాణయ్య, వార్డుసభ్యులు చిలపల్లి ఎక్బాల్, నైకోటి జగదీశ్వర్, కలాలి అంజయ్య గౌడ్, బుర్ర సురేష్ పాల్గొన్నారు.



ఎనగండ్లలో దరఖాస్తులను స్వీకరిస్తున్న సర్పంచి వీరారెడ్డి

**ఎనగండ్ల గ్రామంలో...**

**కొల్చారం, జవవరి 4 ప్రభాతవార్త:**
'ప్రజాపాలన'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎనగండ్ల గ్రామ సర్పంచి దమ్మన్నగారి వీరారెడ్డి అన్నారు. గురువారం కొల్చారం మండలం ఎనగండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి దమ్మన్నగారి వీరారెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా గ్రామ ప్రజలు అధికారులకు ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ ప్రజలు ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వి నియోగపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి సుమలతబాబు, తహశీల్దార్ గఫార్‌మియా, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ నాగవర్ధన్, ఆర్ఐ ప్రభాకర్, ఏఈవోలు అంబిక, నిరోషా, రోజా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీనర్సమ్మ, టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే ప్రజా పాలన

### ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

**హవేలీఘనపూన్ ,జనవరి 3,ప్రభాతవార్త:**
ప్రజల వద్దకే పాలన నిర్వహించి అదికారులు సైతం గ్రామానికి వస్తారని, ప్రజల వద్దకే పాలన అని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బూరుగుపల్లి, గాజిరెడ్డిపల్లి గ్రామాలలో ప్రజా పాలనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించాలనే ఉద్దేశంలో ఆరు గ్యారంటీలను తిసుకోచ్చిందన్నారు. 6 గ్యారంటీలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో నాయకులు ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే గ్రామాలకు వచ్చేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదన్నారు. గతంలో ఏ చిన్న దరఖాస్తు ఇవ్వాలన్నా అధికారుల చుట్టూ తిరగాల్సి ఉండేది, కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులే మీ ఇంటికి వచ్చి దరఖాస్తులను తిసుకుంటున్నారన్నారు. అనంతరం బూరుగుపల్లి జడ్పీహెచ్ఎస్ హై స్కూల్‌ను సొంత నిధులతో, మౌళిక వసతులు పూర్తి చేస్తానని అన్నారు. పాఠశాలను దత్తత తిసుకున్న అనంతరం ఘాజిరెడ్డిపల్లి ప్రజా పాలనలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో అంబదాస్, తహసీల్దార్ నారాయణ, అడిషనల్ ఎస్పీ మహెందర్, స్పెషల్ ఆఫీసర్‌లు విజయ లక్ష్మీ, ఎంపీడీవో శ్రీరామ్, సర్పంచి చిన్నగౌడ్, సర్పంచి సుభాష్, సర్పంచి భాగ్యలక్ష్మీ శ్రీనివాస్, ఎంపీటీసీ అర్చన శ్రీనివాస్, నాయకులు కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల, మండల అధ్యక్షులు లక్కర్ శ్రీనివాస్, పరశురాంగౌడ్, అక్బర్ సాప చిన్నసాయిలు, సిద్దగిరి గౌడ, ఆఫీస్ ఉద్దిన్, రవీందర్‌గౌడ్, రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన పీఏసీఎస్ చైర్మన్

**శివ్వంపేట, జనవరి4 ప్రభాతవార్త:**
శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి సత్తయ్య గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న స్థానిక పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి గురువారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటంబాన్ని పరామర్శించిన అనంతరం 5 వేల రూపాలయ ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా 50 కిలోల బియ్యాన్న బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబాలను తప్పకుండా ఆదుకుంటానని చైర్మన్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు సంతోష్ కుమార్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు భూమలింగం, నాయకులు నాగరాజు, నందు, కృష్ణ, మహేష్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, జనవరి 4 ప్రభాతవార్త:** పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్ మండల పరిధిలోని గంగాపూర్, తుర్కాపల్లి, సిర్గాపూర్‌లోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి మాట్లాడుతూ సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలు అమలయ్యాయని మిగితా నాలుగు త్వరలో అమలవుతాయన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించే మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలవుతుందని అన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కూడా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు కాంగ్రెస్ ప్రభుత్వం పెంచడం జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు దరఖాస్తులను అధికారులకు అందజేయాలన్నారు. ఇందిరమ్మ పాలించిన తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకు పాలనను తెచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందాలనే దృఢనిశ్చయంతోనే ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, గంగాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, తుర్కాపల్లి సర్పంచ్ స్రవంతిపరమేష్, రమేష్‌చౌహాన్, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ క్యార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

**మెదక్ అర్బన్, జనవరి 4 ప్రభాతవార్త:** గత సంవత్సరం నవంబర్‌లో మెదక్ పట్టణంలోని కొరిగడ్డిలో కుమ్మరి సత్యనారాయణ బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు అతని బైక్‌ను దొంగతనం చేశారు. అట్టి దొంగతనం చేసిన వ్యక్తిని గురువారం పట్టుకొని జైలుకు పంపడం జరిగిందని మెదక్ పట్టణ సీఐ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడు రంగారెడ్డిజిల్లా కర్మాన్‌ఘాట్ నందనవనం కాలనీకి చెందిన దేవతమ్మల శివ అని, కామారెడ్డి వైపు బైక్‌ను అమ్ముకుందామని వెళ్తుండగా పోలీసులు పట్టుకొని బైక్ పత్రాలు చెక్ చేయగా నిందితుడు తాను చేసిన నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టుచేసి జైలుకు పంపడం జరిగిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.



ఫిల్టర్‌లను ధ్వంసం చేస్తున్న రెవిన్యూ అధికారులు

## బ్యాతోల్‌లో ఉసికె ఫిల్టర్‌లు ధ్వంసం

**కంది, జనవరి 4, ప్రభాతవార్త:** మండలంలోని బ్యాతోల్ గ్రామ శివారులో అక్రమంగా ఏర్పాటుచేసిన ఉసికె ఫిల్టర్‌లను గురువారం రెవెన్యూ అధికారులు ధ్వంసం చేశారు. తహసీల్దార్ పర్యవేక్షలో ఉసికె ఫిల్టర్‌లను ధ్వంసం చేశామని ఆర్ఐ వెంకటరామరెడ్డి పేర్కొన్నారు.

## పేద దంపతుల కుమార్తె పెండ్లికి పుస్తెలు, మెట్టెల పంపిణీ

**రామాయంపేట, జనవరి 4, ప్రభాతవార్త :** పట్టణంలోని ఇందిరా కాలనీలో నివాసం ఉంటున్న ఎర్ర రెడ్డయ్య, లక్ష్మీ పేద దంపతుల కుమార్తె పెండ్లికి ప్రముఖ సంఘ సేవకుడు వెంకుగారి రాజిరెడ్డి సహాయం సహకారాలు అందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకుగారి శ్రీధర్‌రెడ్డి ద్వారా పుస్తెలు, మట్టెలు అందించి సహాయం అందించారు. ఈ సందర్భంగా వధువు, వారి కుటుంబ సభ్యుల, కాలనీవాసులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బైరామ్ కుమార్, పార్టీ పట్టణ ఎస్‌సి సెల్ కార్యదర్శి అసాది రాజు, మనోజు, ఎర్ర సంతోష్, ఎర్ర రాజేందర్, రాజు, అసాది మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎంఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో...**

**నిజాంపేట, జనవరి 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నందగోకుల్ గ్రామానికి చెందిన పేద కుటుంబమైన ఏనుగంటి సిద్దరాములు, లక్ష్మి కుమార్తె కల్పన వివాహానికి గురువారం ఎంఎస్ఎస్ఓ మండల అధ్యక్షుడు గుమ్ముల అజయ్ పుస్తెలు, మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనంపల్లి సోషల్ ఆర్గనైజేషన్ పేద కుటుంబాల ప్రయోజనాల నిమిత్తం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మైనంపల్లి హనుమంతరావుకు, ఎంఎస్ఎస్ఓ స్థాపకుడు మైనంపల్లి రోహిత్‌కు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు అందెస్వామి, నాయకులు భూపతిరెడ్డి, మ్యాదరి నర్సింలు, చాకలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తెలు, మెట్టెలు బహూకరించిన బండారి సంతోషగంగాధర్

**శివ్వంపేట, జనవరి 4 ప్రభాతవార్త:**
సంఘ సేవకులు, సేవారత్న అవార్డు గ్రహీత, బీఆర్ఎస్ పార్టీ మండల కోశాధికారి బండారి సంతోస్ గంగాధర్ సేవల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. దీంట్లో భాగంగానే నిరుపేద కుటుంబాల ఇళ్లల్లో జరిగే వివాహాలకు ఉచితంగా పుస్తె మెట్టెలు అందిస్తున్న విషయం తెలిసిందే. అడిగిన వెంటనే కాదనకుండా పేదింటి ఆడపిల్లల వివాహాలకు నేనుసైతం అంటూ పుస్తె మెట్టెలు అందిస్తూ బండారి సంతోష గంగాధర్ పలువురి మన్ననలు పొందుతున్నారు. ఇప్పటివరకు సుమారు వెయ్యికిపైగా పెళ్లిళ్లకు పుస్తె మెట్టెలు బహుకరించడం జరిగింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన బ్యాగరి అమృత, శ్రీనివాస్ దంపతుల కూతురు హిమబిందు వివాహానికి బుధవారం పుస్తె మెట్టెలు అందజేయడం జరిగింది. దేవుడు తనకు కల్పించిన సంపాదనలో భాగంగానే పేదింటి పెళ్లిళ్లను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే పుస్తెమెట్టెల బహుకరణ ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు బండారి సంతోష గంగాధర్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు.

## సర్పంచ్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**హత్నూర జనవరి 4, ప్రభాతవార్త:**
సర్పంచ్ వీరస్వామీగౌడ్‌ను గురు వారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. అనారోగ్యానికి గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సర్పంచ్‌ను హత్నూరలోని అతని ఇంట్లో కలసి పరామర్శించారు. పరామర్శించినవారిలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి అవుల రాజిరెడ్డి, నాయకులు ఆంజనేయలుగౌడ్, సుహాసినిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శేషసాయిరెడ్డి, కొన్యాల వెంకటేశం, ఎం.ఎ.హాకీమ్, కృష్ణ, సత్యం, మనీదీప్, రియాజ్‌అలీ, నర్సింహారెడ్డి, ఆంజనేయులు, భూపాల్‌రెడ్డి, హరీష్‌వర్ధన్, అసీఫ్, సందీప్, మహిపాల్‌రెడ్డి, వల్లిగారి సాయికుమార్ పాల్గొన్నారు.

# సమాజాన్ని చైతన్యపరిచే ఆయుధంగా మీడియా ఉండాలి

### లోక్‌సత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ

**గజ్వేల్, జనవరి 4 (ప్రభాతవార్త):**
సమాజాన్ని చైతన్యపరిచే ఆయుధంగా మీడియా రంగం కొనసాగుతుందని లోక్‌సత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. గురువారం ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బండారు రాంమోహన్‌రావు ఆధ్వర్యంలో మాటామంతి మోహనరాగం వెయ్యి ఎపిసోడ్‌లుపూర్తిచేసుకున్న సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. 30 సంవత్సరాల క్రితం ప్రజలను ప్రభావితం చేసేవి మీడియా, సినిమాలు మాత్రమేనని, నర్సింగరావు దర్శకత్వం వహించిన మాభూమి, దాసి సినిమాల ద్వారా తాను ప్రభావితం పొందానన్నారు. మీడియా డిజిటలైజేషన్ ద్వారా కొత్త పద్ధతులు వెతుక్కుంటుందని, అలా రూపొందించిందే స్వరమీడియా, దీనిని రూపొందించి నడిపిస్తున్న రాజేష్, బండారు రాంమోహన్‌రావు, విశ్వేశ్వరరావులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 8 వేల నుండి 10వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టారని, రాజకీయం అంటే ప్రజాసేవ చేసే స్థాయిలో ఉండాలి కానీ వ్యాపార స్థితికి రాజకీయాలు చేరాయన్నారు. దీనంతటికీ కారణం చదువుకున్న వారు ప్రశ్నించకపోవడమే అని, మనకెందుకు అంటూ చూస్తూ ఊరుకుంటే రేపు దేశానికి ముప్పు వాటిల్లే పరిస్థితి వస్తుందన్నారు. సభాధ్యక్షుడు బండారు రాంమోహన్‌రావు మాట్లాడుతూ వెయ్యి ఎపిసోడ్‌లకు సహకరించిన అతిథులకు, అభిమానులకు అందరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్య బ్రహ్మ డాక్టర్ శంకర్‌నారాయణ, కోమందూరి రామాచారి, ధ్యానంపల్లి సత్యనారాయణ, బండారు ఫణీందర్ రావు, బండారు రాంప్రసాద్, ఆర్‌కె, డాక్టర్ విజయ లక్ష్మి, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ